

కాశీరత్నం నవ్వుతాడు ఏంచూసినా—ఏడవడం మరచిపోయి ఎంతోకాలం అయినట్టు—

అతని వయసునిబట్టి అనుభవాన్నిగాని, అనుభవాన్నిబట్టి వయసునిగాని, కొల వెయ్యడం అవివేకమే అనిపిస్తుంది నాకు మట్టుకు—

తమమీద తమకి విశ్వాసం, తమ ఉనికిమీద తమకి సంతృప్తి లేనివాళ్లని చూసి, పెదవులుకదిపి, నీరు ఎండిన కళ్లతో నవ్వుతాడు.

గాజులు చప్పుడైతే, కాశీరత్నం చదివే చదివే పేపరు పక్కనపడేసి, భార్యని చూస్తాడు తలెత్తి—సాయంకాలపు సహజమైన నీరసంతో—

అతనిభార్య, మంచినీళ్లుతెచ్చి పక్క పెడుతుంది—ఇనపవాసనవేసే, వెచ్చని, 'పైపు' నీళ్లు—

కాశీరత్నం భార్య నవ్వదు—అతనే నవ్వద్దని కోరాడు ప్రత్యేకంగా—అందుకే ఆమె నవ్వదు.

కాశీరత్నానికి భయం, భార్యజబ్బు నవ్వు చూడ్డం—

విలాసంగా కదిలి,—'ఎందుకు నవ్వద్దన్నారూ? బాగా నవ్వలేవా!' అని గారం చేసేంత నాగరికతా, రొమాన్సూ, అతని భార్యలోలేవు,

ఈ అభిప్రాయం, చూసేవాళ్లకి తోచే ఒక అంశంమాత్రం—

కాశీరత్నానికి అభిప్రాయాల బాధకంటే వళఆకలిబాధ ఎక్కువ,

అతను ప్రతి చిన్నవిషయాన్ని గురించి ఆలోచించే ఓపిక లేక, చికాగ్గా నవ్వుతాడు. అతను మామూలుగా బతికేస్తున్నాడు.

* * *

ఒకరోజు—

అత్తగారు, ఖంగుమని ఇల్లు ప్రతిధ్వనించేలాగ పిల్చింది కోడల్ని—

ఖంయ్‌మని ఏడుస్తూ చిన్నమరిది కాలికి చుట్టుకున్నాడు.

బొగ్గుల కుంపటిమీద అన్నపుగిన్నె మీదీ మూత ఎగిరిపడుతోంది.

గాలికి నిప్పురవ్వలు చెదురుతున్నాయి.

'ఆఁ—వస్తున్నా—' అంటూ, వచ్చే పొడిదగ్గుని పైటకొంగుతో ఆపుకుంటూ,

— గుండెల్లో పెల్లుబుకుతున్న ఒకబాధాతరంగాన్ని అణిచిపెడుతూ, కాలికి చుట్టుకున్న మరిదిని బుజాన వేసుకుని, లోపలికి వెళ్లింది.

కాశీరత్నం ఇదంతా చూస్తున్నాడు— నిర్లిప్తమైన నవ్వు తడితడి పెదాలవెనక్క మణిగిపోయింది.

మరీ నాగరికుల మనుకునేవాళ్లు కొందరు కాశీరత్నాన్ని వెకిలిమనిషంటారు. 'అస్తమానం అయినదానికీ, కానిదానికీ, అలా కులికిపోతోన్నట్టు నవ్వుతాడెందుకు, త్రాష్టంలాగ!—' అని.

అతనితల్లే అంటుందీమాట తరుచుగా— తనభర్త 'ఆస్తి'ధ్వంసం చెయ్యకుండా తను కాపరానికొచ్చి తొలిరోజుల భాగ్యాన్ని జ్ఞాపకం చేసుకుంటూ—

కాశీరత్నం అమ్మతిట్లుతిట్టినా మాట్లాడడు—

భయంకాదు—భక్తికాదు — అమ్మంటే జాలేస్తుందతనికి—నవ్వొస్తుంది కూడా—

ఆ సాయంకాలం,

అత్తగారు కోడల్ని కేకేసి, కొన్ని సూచనలూ, తిట్లూ, సణిగిపోసేవేళ.—

పేపరుపక్కన పడేసి, బయటికి పోదామని బయలుదేరాడు కాశీరత్నం—

తల్లి పెరటివైపునించి వచ్చి, 'ఎక్కడికి?' అంది.

'ఆఫీసులో డిన్నరుంది—వెళ్లాలి.'

'ఉంటే!'

'వెళ్లాలి'

'తమ్ముణ్ణికూడా తీసికెళ్లు'

'వాణ్ణా'

'ఆఁ— వాణ్ణే—ఏవిటి అభ్యంతరం!'

'అక్కడికి పెద్ద ఆఫీసర్లూ వాళ్లూ వస్తారు. బాగుండదేమో!'

'నిక్షేపంలా ఉంటుంది — ఇప్పుడే వెళ్లాలా!'

'కాదు ఎనిమిదింటికి — అందాకా క్లబ్బుకి వెళ్తున్నా—

'క్లబ్బుకా!—పామాన్నుతేవాలి.'

'తెమ్మను—తమ్ముడున్నాడుగా!'

'వాడిప్పటిదాకా తిరిగొచ్చాడు—నువ్వెళ్లిరా—వాడింటి పట్టునుంటాడు.'

కాశీరత్నం తల్లికేసిచూసి ఊరుకున్నాడు.

'సరేమరి, దాన్ని సంచీతెమ్మను. పెంద రాళే వెళ్లాలి మళ్ళీ.'

'రాత్రి తమ్ముణ్ణి తీసికెడతావామరి!'

'పిలువడదేమో!'

'అయితే ఓపనిచెయ్యి!'

'ఏవిటి?'

'నువ్వూ వెళ్ళకు!'

కాశీరత్నం తెల్లబోలేదు.

'అదేం!' అని మాత్రం అన్నాడు.

'అది బియ్యంపోసింది—ఆ అన్నం అంతా బయట పారబొయ్యాల—ముందు చెప్పుకో పద్దూ! ఏం—అర్థమైందా! — ఓమాటలా తిరిగొస్తే తిరిగిరా. దీపాలు పెట్టేవేళకి ఇంటిపట్టునుండాలి సుమా ! — నేను సహించను!'

'సరేలేవే బాబూ — వెళ్ళనులే—సరా!— నీ కోడలుందా అక్కడ—'

'ఆఁ—ఏవిటా రాచకార్యం — ఏదో పని చేస్తోంది—నాతోచెప్పు.'

'ఏంలేదులే—' అన్నాడు కాశీరత్నం సందేహిస్తూ—

'ఏవో రహస్యాలుగాబోలు – మాయసంత— తరవాత చెప్పొచ్చులే—'

'నీకు తెలియని రహస్యాలేం ఉంటా యమ్మా!'

'అమ్మ!—గౌరవం మండిపోతోంది. నీపని చూసుకోవెళ్లి —అందలా లెక్కించక్కర్లేదు అడుక్కుతినమని వదిలెయ్యకపోతేచాలు.'

జారే జారే జుట్టు ముడీ—

చాలీ చాలకుండా ఒంటిని సగం సగంగా కప్పే చీరగుడ్డా — ఇదో ప్రత్యేకమైన వితంతురూపం.

బైట, పెరటివైపు తలుపు చాటునుంచి, యీ గొడవ వినే, అతని భార్య కటకట పడింది.

పెరటివైపు వచ్చే కాశీరత్నం తల్లికీ, కోడలు కనిపించింది — సాభిప్రాయంగా — 'మా యిళ్ళల్లో సొమ్ము నిలవడం మామూళ్ళు లేవు – జబ్బులూ, మందులూను, రంగరాజుగారబ్బాయిని చూస్తే ముచ్చ టేస్తుంది—పట్టుమని పాతికేళ్లు లేవు— అప్పుడే ఏమ్మో—పెళ్ళాం బంగారుబొమ్మ!— పుటి గడిగిన ముత్యాల్లా ఉంటారు—మనం ఉన్నాం ఎందుకు?—ఓ ఎదుగా—పొదుగా...'

కోసేస్తోన్నట్టుగా సాధిస్తోంటే, కాశీరత్నం భార్యకి, ఒళ్ళు ఉడికిపోయి, సమాధానం చెప్పింది—

'మనం ఎవళ్ళం లేకపోతే, ఆయనా చదువుకుని సుఖపడుదురు!' అనేసింది.

'ఆ—య—నా..అదృష్టం మండిపోయి... నీకు వాడూ, వాడికి నువ్వూ...'

'మా ఇద్దరికీ మీరూ...'

కాశీరత్నం తల్లి, యీ అవమానం భరించలేక, రాగాలెట్టడం మొదలెట్టింది.

ఈ ఘోర దురంత సంగ్రామం చూసి, కాశీరత్నానికి తల బద్దలయ్యేలాగా ఉంది.

కాశీరత్నానికీ, తల్లిమీదా, భార్యమీదా కూడా జాలివేసింది.

ఇద్దరూ తనమీద 'జాలి' చూపిస్తూ కొట్లాడుకుంటూంటే నవ్వొచ్చింది—

నలభయ్యేళ్ల అమ్మ, ఇరవైమూడేళ్లకే సంసారయాత్రలో పెళ్లితో ముడిపడ్డ భార్య తల బరువులతో కాశీరత్నం—

కారణమేమో తెలియకుండా తల్లి ప్రద ర్శించే కోపాన్ని తప్పుకోవడానికి అలవాటు పడ్డా, అప్పుడప్పుడు అతనిలో ఏదో ఉద్ధృతమైనశక్తి లేవబోయి, తల్లిమీద జాలితో అణిగిపోతుంది.

కాశీరత్నం భార్యకి, అర్థంచేసుకోదగిన గుండె జబ్బు—ఆమె ఆవేశపడితే చాలు, అది ఆమె నొక్కర్తినేకాక, ఇంటిల్లిపాదినీ కలత పెడు తుంది.

ఇటు ఆశలు చచ్చిన అమ్మ. అటు జబ్బుతో. సున్నితమైన పలకరింతకోరే భార్యా, కాశీరత్నంలో మంచితనాన్ని పరీ క్షిస్తూనే ఉంటారు,

* * *

మరొకరోజు—

సాయంకాలం—

క్రిందటేడు సరిగ్గా ఇట్లాంటి సాయం కాలమే అందరితోపాటూ కాశీరత్నంకూడా ఏడిచాడు. ఇవాళ మళ్లీ ఎవళ్లోరావడంతో అంతా ఏడుస్తున్నారు కాశీరత్నం ఆఫీసు నించి ఇంటికి వచ్చేటప్పటికి—

ఎవళ్లో కొత్తబంధువులు— కాఫీలూ— ప్రేమలూ — పలకరింతలూ— ఓదార్పులూ—

ఓ ముసలావిడ గొల్లుమంటూ, కాశీ రత్నం బుజం నిమురుతూ— 'తండ్రిపోయినా ఏదో పెద్దతనం వహించి, కొంత నిలబెట్టు కున్నావురా బాబూ!... భగవంతుడు పగ సాధిస్తున్నాడు...సంసారమే ప్రధానం అనుకో వాలింక తప్పుతుందా—సుఖాలా, దుఃఖాలా, ఇవాళుండేవీ, రేపుపోయేవీ—వీళ్లందర్నీ పైకి తీసుకొచ్చి, ఇంత కలోగంజోపోసి, దారి చూపిస్తివా—పెద్దముండని చెబుతున్నాను—

స్వర్గంలో ఉన్న మీ నాన్న మనస్సుకి శాంతి...' ముసలావిడ కన్నీళ్లలో ఓదార్పుని మింగుకుని, కాశీరత్నానికి ధైర్యం చెప్పింది.

కాశీరత్నం భార్య కళ్ళు తుడుచుకుని, పక్కగదిలో, వొచ్చేదగ్గు తెరలనీ, గుండె మంటనీ అణుచుకుంటూ, మొగానికి సగం సగం వేసుకున్న పౌడర్ చెరిపేసుకుంటోంది.

కాశీరత్నం గదిలోకొచ్చి, కళ్ళు తుడుచుకుని నవ్వాడు.

భార్యదగ్గర కొచ్చి నిలబడ్డాడు. ఆమె తలెత్తి చూసి, లేచి నిలబడి తలొంచుకుంది.

నలుపురంగు మొహంమీద తెల్లని పౌడర్, చర్మాన్ని నీలంగా మార్చినట్టుంది.

కాశీరత్నం, భార్యభుజంమీద చెయ్యి వేశాడు.

ఆమెకళ్ళల్లో నీళ్ళు చంపలమీదికి జారాయి.

ఏదో సినిమా జ్ఞాపకంవచ్చి చటుక్కున కన్నీరు తుడిచాడు.

'ఎందుకూ—?' కళ్ళతోటే, ప్రశ్నించాడు.

'మామగారు...' బొంగురుగా అంది, గొంతు సవరించుకోకుండా— కాశీరత్నం నవ్వలేదు ఈసారి—

'మామగారి కోసం చాలామంది ఏడుస్తున్నారు—నీకోసం నువ్వు ఏడుచుకోలేక— అది చెప్పక అబద్ధం ఎందుకు?' అన్నాడు.

'నిజంగా—' అంది.

'ఏమిటి. అబద్ధం నిజమా!' అన్నాడు.

అంతరంగ తరంగాలు

నెర్వస్‌గా కళ్ళు చిట్లించి, అతికష్టంగా ఊపిరిపీల్చి, గుండెలమీద చేత్తో అదుముకుంటూ, చలికిలబడి కూర్చుంది.

'ఇవాళ హాస్పటల్‌కి వెళ్ళావా?' అన్నాడు.

'లేదు' అన్నది మామూలుగా— కళ్ళు కొద్దిగా తెరుస్తూ—

'చచ్చిపోవాల్సుందేమిటి ఈ జబ్బులో... నేను అటు మావాళ్ళకీ, యిటు నీకూ... ఏమిటో, ఏం ఉపయోగ పడుతున్నాను?' అన్నాడు కాశీరత్నం.

'అదేమిటి!—తప్పు!' అంది ఆమె.

'ఇప్పుడు కాదుగానీ—రేపు ఉదయం హాస్పటల్‌కి తీసుకువెళ్తాను. అశ్రద్ధచేస్తే మరేం అవకతవకల్లోకి దింపుతుందో!'...

అన్నాడు—అతనికింకా చాలా మాట్లాడా లని ఉంది. కాని, కొన్ని విషయాల్ని తన వయస్సూ, మొగతనం, మాట్లాడనివ్వలేదు.

'ఒరే కాశీ, చూశావా, బొమ్మ వెళ్ళిపోతారట—ఉండకుండా...కాశీరత్నం ఓపూట పట్టెడన్నం పెట్టలేడా...'

కాశీరత్నం తల్లిమాట కద్దుపడి—

'ఒస్తున్నా, అదేమిటదీ!—' అంటూ వెళ్ళాడు.

కాశీరత్నం భార్య విషాదంగా నవ్వుకుంది. ఆ వెనక పున్నమివెన్నెలలో బారుమనే సమాధుల చీటలు స్ఫురించాయి.

* * *

ఇంకొకరోజు—

కాశీరత్నం తల్లివసారాలో కూర్చుంది బయట జల్లుపడి వెలిసింది. చలిచలిగాలి చర్మాన్ని కోస్తోంది.

చినిగిపోయిన పాతచీరని కుట్టుకుంటోంది.

చిన్నకొడుకు కాసిన్నిపాలు తాగి పడుకున్నాడు.

ఉదయం తొమ్మిది దాటింది.

కాశీరత్నం గది గుమ్మానికి వేసిన తెర చూసింది.

గదిలో ఒక అగరొత్తు సగంపైగా కాలి, పొగ వ్యాపిస్తోంది.

కాశీరత్నం తల్లి అటు చూసింది చటుక్కున కుట్టడం మాని అతని గదిలోకి వెళ్ళింది చూస్తోంది.

పక్కమీద కాశీరత్నం భార్య విప్పి పారేసిన బాడీతీసి, కసిగా ముక్కలు చేసింది.

గోడనున్న అగరొత్తు తీసి కిటికీలోంచి బయటికి విసిరేసింది.

చూస్తోంది.—

రాంటిన ఉన్న చిన్న భరిణలోంచి తీసి, చిన్న చిన్న నల్లమందు మాత్ర వేసుకుంది.

ఏవో కేలండర్లు—ఒక శృంగార సంబంధమైన బొమ్మకేసి చూసి, తన కేసి చూసుకుంది.

మబ్బువల్ల చీకటి చీకటిగా ఉంటే, దీపం వేసింది.

అద్దంలో చూసుకుంది.

అక్కడక్కడ కొద్దిగా నెరుస్తోన్న తల— కళ్ళల్లో మెరిసే యౌవనపు వెలుగు క్షీణించింది చాలామట్టుకు—

కొడుకు గదిలో ప్రతి వొస్తువూ ఏదో ప్రత్యేకంగా కనిపించింది.

కిటికీ గూట్లో ఉన్న 'ఇంటర్నేషనల్—హెల్త్' పత్రిక అట్టమీద వస్తాదు బొమ్మ...దుమ్ము దులిపి, అటూ ఇటూ చూసింది.

గుండ్రని, నున్నని జబ్బలూ, బలిష్ఠమైన పిక్కలూ,—ఛాతీ—

పత్రిక ఉండచుట్టి కిటికీలోంచి విసిరేసింది.

బయటనించి ఎవరో కేకేశారు. గబగబ వచ్చింది.

'ఎవరూ'— తలుపు తీసింది.

'కాశీరత్నంగార్ని అయ్యగారోసారి రమ్మన్నా



వాయిదాల చెల్లింపు పద్ధతిన
ట్రాన్సిస్టర్లు
రు. 255 విలువ గల
'ఎవర్కార్ట్' 3 బ్యాండ్
ఆల్ వరల్డ్ పోర్ట
బుల్ ట్రాన్సి
స్టర్‌ను నెలకు

రు. 25/- చెల్లించే పద్ధతిన తెప్పించుకోండి.
JAPAN AGENCIES (AP 77)
Post Box 1194, Delhi 6



కుటుంబ నియంత్రణకు
సత్యా రక్షణి
* ఆపరేషన్ భయములేదు. * పురుషులు మాత్రమే యీ ఔషధము సేవించుటకు తయారుచేయబడినది * ఔషధమువలన ఎప్పటికి సంతానము కలుగక ఆరోగ్యవంతులుగా ఉందురు. * దాంపత్యజీవితమున కెట్టి అసౌకర్యము ఉండదు. * నరములు పటుత్వను కల్గించి ఉత్సాహమును ప్రసాదించును. * ఔషధము మాత్రం 30 రోజులు సేవించవలెను. * పత్యములేదు. పూర్తి కోర్సు సీసా వెల రు. 10/- పోస్టేజి ప్యాకింగ్ అదనం.
స్వదేశి ఆయుర్వేద ఫార్మశీ,
తెనాలి, (ఆంధ్ర ప్రదేశ్)

అంతరంగ తరంగాలు

రండి—' అన్నాడు.

'నువ్వెవరివి—' అంది.

'ఆఫీసు బంట్రోతునండి—' అన్నాడతను.

అతన్ని చూసింది—మోటుగా బలంగా కనిపించే అతన్ని—

'అట్లాగే చెప్తానమ్మా. భార్యగారిని తీసుకుని హాస్పత్రికి వెళ్ళాడు. రాగానే చెప్తా—ని పేరెవరన్నావూ!'

'ఎందుకండీ—యీరన్నంటారండి.'

'ఇదిగో వీరన్నా, యిలా చూడమ్మా, చిట్టి అటకమీద కొబ్బరికాయలున్నాయి, వాలుక్కాయలు తీసి కింద పారేద్దూ, డబ్బులిస్తా—' అంది.

'వాక్కుదరదమ్మా, కుర్రాయనొచ్చాక అరితో సెప్పండి—' వెళ్ళిపోయాడు.

'ఏం పొగరుమోత్తనం!' అని వాడికేసి విసుగ్గా చూసి—లోపలికొచ్చింది.

కాశీరత్నం గది గుమ్మానికి కట్టి ఉన్న తెర, ఆమె తలకి చుట్టుకుంది గాలికెగిరి—విసుక్కుని ఆ తెరని ఓ మూల చింపింది. కాశీరత్నం భార్యను తీసుకుని లోపలికొచ్చాడు ఆఫీసుకి వెళ్ళాలని తల్లి చెప్పింది. ఆమె కోడల్ని ఓరగా చూస్తూ వెళ్ళిపోయింది.

కాశీరత్నం నవ్వుకున్నాడు.

* * *

కాశీరత్నం స్నానంచేసి వచ్చాడు.

అతని భార్య అతని తలకి కొబ్బరినూనె రాసి వెళ్ళిపోయింది.

అద్దం ముందు నిలబడి తల చూసుకున్నాడు నెరుస్తోంది.

కాశీరత్నం మనస్సు, తలా, రెండూ తెల్లబడ్డాయి.

మనస్సుకి పెద్దతనం వస్తోంది. ఆలోచనలతో తల కాగిపోయి నెరుస్తోంది.

తల తుడుచుకున్నాడు జిడ్డుగా ఉందది.

లోపలి గదిలోకి వెళ్ళి 'డై' తెచ్చి, తలకి పూసుకుని, తల ఆరబెట్టుకుని, స్నానంచేసి మళ్ళీ అద్దంలో చూసుకున్నాడు.

నల్లబడ్డ, జుట్టుతో మొహానికి కొత్త అందం వచ్చినట్టుంది.

ఎందుకో ఆనందంగా ఉందీరోజు — కాశీరత్నం బట్టలుమార్చుకుని. అద్దంముందు నిలబడి తల దువ్వుకుంటూ భార్యని పిలిచాడు.

వచ్చింది.

నెమ్మదిగా అంది— 'అలా గట్టిగా అరుస్తారెందుకు? మీరు పిలవడం వింటంటే ఆవిడ, కసిగా, పనిగట్టుకుని ఏదో తెముల్చుకు బయటపడలేని పని చెబుతుంది — ఏమిటో ఆ అక్కసు — ఒక క్షణం మనం ఇలా మాట్లాడుకుంటూ నిలుచున్నామూ!— ఏంటో గంగవెర్రు లెత్తిపోతుంది. వాకేదోపని చెప్పి పంపేసేదాకా...ఇంతకీ...'

'ఇస్—నన్నొద్దని నువ్వరుస్తావే!—ఏం—ఇంకేం చెయ్యను?—'

'సరి—ఇదీ మరీ బాగుంది—నేను పని చూసుకుంటున్న ప్రాంతంలో వోసారి నాకు కనిపించిపొండి — ఏదో కారణంగా — నేనే వస్తా...' తొందర తొందరగా మాటాడ్డంలో గొంతులో ధ్వని తొణికింది. దగ్గర తెర కమ్మింది. ఉక్కిరి బిక్కిరైంది. ఆయాసపడింది. కనుకొలకుల్లో నీళ్ళు తిరిగాయి—

కాశీరత్నానికి జాలివేసింది. దగ్గరగా తీసుకుని, దగ్గు తగ్గేవరకూ బుజం, వీపు, నిమురుతూ పట్టుకున్నాడు. కాశీరత్నానికి అప్పుడు ఏడుపొచ్చింది,

కాశీరత్నానికి భయంతో కూడిన సందేహం వచ్చింది.

కాశీరత్నం భార్య అతని కౌగిటిలో నిర్లిప్తంగా పెదవి విరిచింది.

మమతా, విరక్తీ, ముడిపడ్డట్టున్నారు వాళ్ళు—

మొగవాడూ ఆడదీ సంఘాన్ని దాటి వెళ్ళకూడదు. సంఘం ఆచారాల్ని దాటి వెళ్ళకూడదు. ఆచారాలు ఋషుల్ని దాటి వెళ్ళకూడదు. ఋషులు వేదాల్ని దాటి వెళ్ళకూడదు. వేదాలు బ్రహ్మని దాటి వెళ్ళకూడదు — బ్రహ్మ సృష్టిని దాటి వెళ్ళకూడదు. సృష్టి లోకాల్ని దాటి వెళ్ళకూడదు— లోకాలు ప్రళయాన్ని దాటి వెళ్ళకూడదు— ప్రళయం శివుడి మూడో కన్ను దాటి వెళ్ళకూడదు—

కాశీరత్నం, జబ్బు రంగు నెత్తుటితో వెలవెలబోయే భార్య ముఖాన్ని చూసి భయపడకూడదు—

ఇందుకేనేమో, కాశీరత్నానికి సర్వం సందేహగ్రస్తంగా, సమస్యామయంగా కనిపిస్తుంది.

(అవునుగాని, ఇదెక్కడా చూడలేదు—)

ఏమేయ్యా— ఆ పిల్లాడికలా వొంటిమీద నీళ్ళుపోసి, లోపలికి చక్కావచ్చావుకదా, వొళ్ళు నానిపోతే, ఏడుస్తూ, దిక్కుమాలిన వాడిలా, వాడు అలా ఉండాల్సిందేనా!...' అని మాట్లాడేసుకుంటూ, కాశీరత్నం భుజం నుంచి తల తీసుకుని, కన్నీళ్ళు తుడుచుకునే కోడల్ని చూసి, గుమ్మంలోనే ఆగిపోయింది.

కాశీరత్నం భార్య లోపలి గదిలోనికి వెళ్ళిపోయింది.

అతను తల్లి మొహం కేసి భయం భయంగా చూశాడు.

ఆవిడ ఆలోచిస్తూ నిలబడిపోయింది. కాశీరత్నం తలొంచుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు.

* * *

రాత్రి కాశీరత్నం ఇంటికొచ్చేటప్పటికి ఆలస్యమైంది.

కాశీరత్నం వెన్నెట్లో నడిచి వచ్చాడు. మొహం, తన స్వంత వయస్సుని జ్ఞాపకం చేసుకుంటోంది.

కాశీరత్నంలో ఇన్నాళ్ళూ అణిగిమణిగి ఉంటోన్న ఏదో శక్తి—దృఢమైన కామన—విజృంభిస్తోంది.

భార్యని బాగు చెయ్యడమో, చంపెయ్యడమో, ఏదో ఒకటి తేల్చుకోవాలనుకున్నాడు. ఓ వందరూపాయలు అప్పు తెచ్చాడు.

రాత్రి పది దాటింది.

కాశీరత్నం తలుపు తట్టాడు—

తల్లి, తలుపుతీసి 'ఇప్పటిదాకా ఎక్కడున్నావురా?' అంది అనుమానాస్పదంగా —

'పని ఉండి ఉన్నాను' అన్నాడు.

'అంటే —'

'అంతే— అదేది... అరుంధతీ...' పిలిచాడు భార్యని—

'ఎందుకూ? తమ్ముడు తిక్కగా నిద్ర పట్టక యేడుస్తోంటే జోకొట్టి నిద్ర పోగొట్టోంది. అక్కడే ఆవిడగారూ జోగుతోంది—ఇప్పుడు లేపకు—నువ్వెళ్ళి పడుకో—' అందావిడ—

కాశీరత్నం తల్లికేసి పరీక్షగా చూశాడు.

ఎప్పుడూ రానంత కోపం వచ్చింది — మింగేసుకుని, మళ్ళీ వీధిలో కొచ్చాడు.

'ఒరే కాశీ...' అని తల్లి కేకేసింది. అందకుండా వెళ్ళిపోయాడు.

ఓ రాత్రివేళ మెళకువ వచ్చి అరుంధతి లేచింది.

వాకిట్లో, కాశీరత్నం, అత్తగారూ, ఏదో ఘర్షణపడ్డం వినిపించింది.—

'అర్ధరాత్రివస్తే తలుపులు తియ్యలేరెవ్వరూ ఇక్కడ — ఇంత దౌర్భాగ్యుడవై పోతున్నావే!'

'నీ కొడుకునేగా—'

'ఛ నోర్ముయ్యి — దిక్కుమాలినవాడా— పెద్దా పిన్నా లేకుండా, ... పేట్రేగిపోతున్నావ్...'

'నన్నవసరంగా రెచ్చగొట్టకు' అన్నాడు తల్లితో కాశీరత్నం తెగించి—

కాశీరత్నం తల్లి ఇది ఏనాడూ ఊహించలేదు. ఆమె ఆవేశం వశం తప్పింది—

'అడ్డమైన షికార్లూ చేసి వచ్చిపడి, ఇంకా బుద్ధిలేక...' ఏదో అనబోయింది.

'నీ కనవసరం—' అన్నాడు

'ఏం పేలావురా!—' అంది గుడ్లురిమి.

అతనికి లోపల భయంగా ఉన్నా, కసి తెచ్చుకుని అన్నాడు.

'నోరుముయ్యమంటున్నా —' అన్నాడు

ఆవిడ అదిరిపడింది.

తెల్లబోయింది — కన్నీళ్ళు తిరిగాయి. పళ్ళు పటపట కొరికి,

'ఛీ—సన్నాసివెధవా' అనేసి కళ్ళొత్తుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

* * *

సరిగ్గా రాత్రి రెండూ, మూడు గంటల మధ్య అరుంధతి కాశీరత్నాన్ని లేపింది. అత్తగారు వరండాలో లేకపోవడం చూసి—

కాశీరత్నం ఉలికిపడి లేచి, భార్యతో కూడా వంటింటి గుమ్మంవైపు వెళ్ళాడు.

తల్లి గుమ్మంలో పడి ఉంది. కాలికేదో తడిగా తగిలితే దీపంతో చూశాడు. కాలి కింద నూనె జిడ్డు. నల్లమందు భరిణ లొంటినించి జారిపడి ఉంది.

గొల్లుమన్నాడు.

మనస్సు పునాదిమీద లేచిన వికారాల వ్యక్తిత్వం శరీరం విడిచి జారిపోయింది.

కాశీరత్నం భార్య కొవ్వొత్తి వెలిగించి తలాపు దిక్కున పెట్టింది.

* * *

రాజేశ్వరి అత్తయ్యా వాళ్ళ ఊరు వెళ్ళినప్పుడు అత్తయ్య చెప్పింది—వింతగా నాకీ సంగతి—

నేను కొన్ని ప్రశ్నలడిగాను. కొన్నిటికి సమాధానాలు చెప్పింది—కొన్నిటికి చెప్పలేదు.

చివరికి విసుగ్గా అంది.

'ఏం ఉంది చెప్పడానికి! — వయస్సులో మొగుడు పోయాడుగా—దీనికి వయస్సెంత నాకంటె చిన్నదికదూ?— అయినా, ఓఘాయిత్యం మనిషికాకపోతే ఏమిటి చెప్పు — వాణ్ణి సరిగ్గా బతకనివ్వక కోసుకుతినేస్తోంటే, ఏదో అన్నట్టున్నాడు—అన్నట్టున్నాడేం ఖర్మ అన్నాడు ఎదిరించాడు — అహంకారానికేం లోటు దీనికి ... అయినా అంత 'యిది' పనికిరాదు ఆడదానికి —'

ఎందుకెందుకంటూనే అత్తయ్య మెరుపులాంటి నవ్వు నవ్వింది 'ఇది' మీద ఒత్తి పలుకుతూ— ●